క్లుప్తంగా

వ్యవసాయ మోటార్లు అపహరణ

మక్కపేట(వత్సవాయి): ఎన్ఎస్పీ కాల్వకట్టపై ఉంచిన వ్యవసాయ మోటార్లు అపహరణకు గురైన సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. గోళ్ల వీరయ్య మిర్చి పంటకు నీరు పెట్టుకునే నిమిత్తం మోటార్‌ను కాల్వకట్టపై ఉంచాడు. బుధవారం రాత్రి గుర్తుతెలియని వారు మోటార్‌కు ఉన్న కనెక్షన్ తొలగించి పైపులను కోసి మోటార్‌ను దొంగిలించుకుపోయారు. మోటార్ విలువ రూ.30 వేలు ఉంటుందని రైతు తెలిపారు. ఘటనపై స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం

నందిగామ: పట్టణంలోని సీతారామాంజనేయ స్వామి వారి ఆలయంలో 70 వ రామకోటి మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా గురువారం ఆలయంలోని స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల మంత్రాల నడుమ శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. పలువురు దంపతులు పీటలపై కూర్చుని స్వామి వారి కల్యాణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ తరువాత రాత్రి పొద్దుపోయే వరకు పలు రకాల ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి. ఆయా కార్యక్రమాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బాబా ఆలయాలలో ప్రత్యేక పూజలు

నందిగామ: మండలంలోని పలు సాయిబాబా ఆలయాలలో గురువారం ఏకాదశి పర్వదినం నేపథ్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. పట్టణ శివారు రామలింగేశ్వర నగర్ లోని సాయి బాబా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. సాయంత్రం సమయంలో పల్లకి సేవా కార్యక్రమం జరిగింది. పట్టణంలోని చెరువు బజార్, అశోక్ నగర్ లోని బాబా ఆలయాలలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని రామిరెడ్డిపల్లి గ్రామంలో గల సాయిబాబా మందిరంలో స్వామివారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ఆయా ఆలయాలలో జరిగిన పూజా కార్యక్రమాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆలయ జీర్ణోద్ధరణ పనులకు శ్రీకారం



పెనుగంచిప్రోలు: గ్రామంలో ఉన్న 11వ శతాబ్దపు నాటి అతి పురాతనమైన శ్రీస్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులకు గురువారం ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టారు. ముందుగా కాకినాడకు చెందిన వాస్తు సిద్ధాంతి కె.దుర్గాప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు, హోమాలు అనంతరం ఆలయంలోని విగ్రహాలను పక్క గదిలోకి మార్చటంతో పాటు పాత ఆలయాన్ని పడవేసే కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం ధ్వజస్తంభాన్ని రెవెన్యూ, పోలీసుల సమక్షంలో తొలగించి శ్రీచక్రం రేకును స్వాధీనం చేసుకున్నారు. ఆలయం పడవేసే పనులను దేవదాయ శాఖ నందిగామ డివిజన్ ఇన్‌స్పెక్టర్ కె.అనురాధ పరిశీలించారు. కార్యక్రమంలో శ్రీఅయ్యప్ప సేవాసమితి అధ్యక్షులు, ట్రస్ట్ నిర్వాహకులు వాసిరెడ్డి బెనర్జీ. శ్రీతిరుపతమ్మవారి ఆలయ మాజీ చైర్మన్లు కాకాని శ్రీనివాసరావు, కర్ల వెంకటనారాయణ, మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, భక్తులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలపై అవగాహన కల్పించాలి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో జగనన్న ఇళ్ల లబ్ధిదారులతో ఇళ్ల నిర్మాణాలు నూరు శాతం పూర్తిచేసేలా అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, గ్రేడ్-5 కార్యదర్శులకు ఇళ్ల నిర్మాణాల్లో చేపట్టాల్సిన చర్యలపై గురువారం అవగాహన కల్పించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇళ్ల నిర్మాణంలో ప్రతి లబ్ధిదారుడిని వ్యక్తిగతంగా కలిసి నిర్మాణాలు జరిగేలా చూడాలన్నారు. మెటీరియల్ సరఫరా దశలవారీ బిల్లులు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. హౌసింగ్ ఏఈ నాగరాజు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే ప్రధాన లక్ష్యం

జి.కొండూరు: గ్రామాల్లో ప్రజలకు ప్రధానంగా అవసరమైన తాగునీరు, డ్రైనేజీ, అంతర్గత రహదారుల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ అన్నారు. మండల పరిధి కవులూరు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే వసంత, స్థానిక సమస్యలు, ప్రభుత్వ పథకాల పంపిణీపై ఆరా తీశారు. తాగునీరు సమస్య ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కవులూరు లో ప్రధాన సమస్యగా ఉన్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

● పేద ప్రజలపై గుదిబండ



నందిగామ: కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ ధరలను పెంచి సామాన్యులపై మోయలేని భారాన్ని వేస్తోందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చనుమోలు సైదులు ఆగ్రహం వ్యక్తం చేశారు.పెంచిన గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ గురువారం నందిగామ గాంధీ సెంటర్ లో సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. సీపీఎం నాయకులు కటారపు గోపాల్, గోపీ నాయక్, సయ్యద్ ఖాసిం పాల్గొన్నారు.



కంచికచర్ల: పెంచిన గ్యాస్ ధరలను కేంద్ర ప్రభుత్వం వెంటనే తగ్గించాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడతామని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కోట కళ్యాణ్ అన్నారు. స్థానిక రైతు బజార్ సెంటర్‌లో పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని గురువారం ఖాళీ గ్యాస్ సిలెండర్లతో నిరసన ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు బెజ్జం భూషణం, రామారావు, గణపతి, వీరమ్మ, లక్ష్మి, జ్ఞానసుందరి, మార్తమ్మ పాల్గొన్నారు.



వత్సవాయి/జగ్గయ్యపేట: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలకు నిరసనగా గురువారం వత్సవాయిలో ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి బి.రాము, నాయకులు ఏసుపోగు వెంకటరత్నం, భూతపల్లి భిక్షం, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు. జగ్గయ్యపేటలో జరిగిన కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి సోమోజు నాగమణి, కోటా కృష్ణ, దంతాల వెంకటేశ్వర్లు, రాజేశ్వరి పాల్గొన్నారు.

నవ నందిగామ నిర్మాణానికి కృషి

- గాంధీ సెంటర్ నుంచి చందాపురం బైపాస్ వరకు విస్తరణ
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

నందిగామ టౌన్: దాతల సహకారం, ప్రభుత్వ నిధులతో నవ నందిగామ నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. పట్టణంలోని గాంధీ సెంటరు నుంచి చందాపురం బైపాస్ రోడ్డు వరకు చేపడుతున్న రహదారి విస్తరణ, అభివృద్ధి పనులకు గురువారం ఆయన శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నందిగామ పట్టణాన్ని అభివృద్ధి చేసే క్రమంలో ఈ ప్రాంతంలోని పారిశ్రామికవేత్తల సహకారం తీసుకుంటున్నామని చెప్పారు. విజయవాడ తరహాలో నందిగామను కూడా అభివృద్ధి చేయాలనేది తమ లక్ష్యమని, పారిశ్రామిక అభివృద్ధితోనే ఈ ప్రాంత నిరుద్యోగులు ఉద్యోగావకాశాలు పొందే వీలుంటుందన్నారు. ఈ క్రమంలోనే రోడ్ల విస్తరణ, 100 పడకల ఆస్పత్రి, కేంద్రీయ విద్యాలయం వంటి వాటి ఏర్పాటుకు కృషి చేస్తున్నామని తెలిపారు.



పారిశ్రామికవేత్తలను సత్కరిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

దాతల సహకారం ప్రశంసనీయం

నందిగామ ప్రాంత అభివృద్ధిలో ఎంతో మంది తమ సహకారం అందిస్తున్నారని ఎమ్మెల్సీ అరుణకుమార్ తెలిపారు. పట్టణంలో ఇరుకుగా ఉన్న రోడ్లను పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా విస్తరించి అభివృద్ధి చేసే క్రమంలో దాతలు అందిస్తున్న సహకారం ప్రశంసనీయమని చెప్పారు. ప్రధానంగా ఇన్వెంటా కెమికల్స్, దొనబండ స్టోన్ క్రషర్స్, లక్ష్మీ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి పారిశ్రామిక వర్గాలు ముందుకు రావటం అభినందనీయమన్నారు. నందిగామ పట్టణాభివృద్ధికి అన్ని శాఖల అధికారులు చిత్తశుద్ధితో పని చేస్తున్నారని అందరి సహకారంతోనే నవ నందిగామ నిర్మాణానికి ముందుకు సాగుతున్నామన్నారు. ఇన్వెంటా కెమికల్స్ అధినేత రాజేష్ (మున్నా) మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రమైన పట్టణాభివృద్ధిలో పాలుపంచుకునే అవకాశం కల్పించటం సంతోషంగా ఉందన్నారు. అనంతరం సహకారమందించిన పారిశ్రామికవేత్తలను ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ అరుణకుమార్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ జయరాం, వైస్ చైర్‌పర్సన్ మాడుగుల నాగరత్నం, ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, నాయకులు గుడివాడ సాంబశివరావు, కాలవ వాసుదేవరావు, దాసు, బాపట్ల సాంబయ్య, జాఫర్, విశ్వనాథపల్లి కృష్ణారావు, మందా మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతు పండించిన ప్రతి గింజను కొంటాం

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

కంచికచర్ల: రైతు ఆరుగాలం కష్టపడి సాగుచేసి పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. కంచికచర్ల వ్యవసాయ మార్కెట్ యార్డులో శనగల కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఏఎంసీ చైర్మన్ కోటేరు మల్లేశ్వరి, జిల్లా మార్కెటింగ్ జనరల్ మేనేజర్ నాగమల్లీశ్వరిలతో కలసి లాంఛనంగా ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. వ్యవసాయానికి ముందుగా పెట్టుబడి సాయం అందిస్తున్న సీఎంను రైతులు ఎన్నటికీ మర్చిపోరని తెలిపారు. వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్న ఏకైక సీఎం జగన్ అన్నారు. ప్రభుత్వం క్వింటా శనగలను రూ.5,335కు కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లో విక్రయాలు జరిగేలా చూడాలన్నారు. మండలంలోని గండేపల్లి, పరిటాల, పేరకలపాడు, వేములపల్లి, మోగులూరు, గొట్టుముక్కల సొసైటీలలో శనగల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. పంట విక్రయాలు జరిగిన వారంలోగా రైతుల బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేస్తారని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, ఏఎంసీ వైస్ చైర్మన్ మాడుగుల శంకర్, వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు, సర్పంచి వేల్పుల సునీత, వైఎస్సార్ సీపీ నాయకులు నన్నపనేని నరసింహారావు, మార్త శ్రీనివాసరావు, కోటేరు సూర్యనారాయణరెడ్డి, వేల్పుల శ్రీనివాసరావు, వెలగలేటి బాబు, షేక్ దాన్‌బహదూర్, వేముల ఆదాం, సొసైటీ అధ్యక్షుడు ఎం శ్రీనివాసరెడ్డి, ఎం.వినయభూషణరావు, నెమలపురి అమ్మారావు, కోదాటి రామకృష్ణ, వేమవరపు పురుషోత్తం, తహసీల్దార్ వి.రాజకుమారి, ఎంపీడీఓ కె.బాలశంకరరావు, ఏఓ కె.విజయకుమార్ పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



కంచికచర్ల మార్కెట్ యార్డులో శనగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

వృద్ధుడికి పింఛన్ మంజూరుకు ఎమ్మెల్యే ఆదేశం

అయ్యా... గతంలో ఎన్నోసార్లు అర్జీ చేసుకున్నా పింఛను డబ్బులు రావటంలేదు. పింఛన్ వచ్చేలా చూడండయ్యా అంటూ పరిటాల గ్రామానికి చెందిన గునిశెట్టి లక్ష్మయ్య ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహనరావుకు విన్నవించుకున్నాడు. తక్షణం స్పందించిన ఎమ్మెల్యే గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శిని పిలిచి లక్ష్మయ్యకు పింఛన్ రాకపోవటానికి కారణం తెలియజేయాలని కోరగా, ఆధార్ కార్డుకు ఫోన్ నంబర్ లింక్ చేయనందునే పింఛను రావటం లేదని వారు సమాధానమిచ్చారు. వలంటీర్ దగ్గరుండి ఆధార్‌కార్డుకు ఫోన్ నంబర్ లింక్ అయ్యేలా చూడాలని, పింఛన్ మంజూరు కోసం అన్ని సర్టిఫికెట్లు దగ్గరుండి చేయించి పింఛన్ వచ్చేలా చూడాలని ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు. గ్రామానికి చెందిన మునిమాల తిరుపతమ్మ తనకు బియ్యం కార్డు రాలేదని ఎమ్మెల్యేకు తెలియజేయగా రేషన్‌కార్డు వచ్చేలా చూడాలని అధికారులను కోరారు.

గడప గడపలో వినతిపై తక్షణ స్పందన

కంచికచర్ల: మండలంలోని పరిటాల గ్రామంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటూ ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాల కరపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని మహిళలు కోరారు. జలజీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికీ కుళాయి ఏర్పాటు చేసి నిత్యం తాగునీరు సరఫరా అయ్యేలా తగు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, సర్పంచి యద్దనపూడి ఆనందజ్యోత్స్న, గ్రామ గృహ సారథుల మండల కన్వీనర్ చింతా రవీంద్రనాథ్, సొసైటీ అధ్యక్షుడు మాగంటి వినయభూషణరావు, వైఎస్సార్ సీపీ నాయకులు వెంపరాల ఆంజనేయులు, మార్త శ్రీనివాసరావు, కర్ల రామకృష్ణ, జమలయ్య, జాన్‌బాబు, ఏసుబాబు, యద్దనపూడి విజయారావు, వేముల జీవరాజు, నాగరాజు, శ్రీధర్, జిక్కుల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



పరిటాలలో వృద్ధుడికి పింఛన్ మంజూరుకు ఆదేశాలు ఇస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

దేవదాయ శాఖ కమిషనర్‌ను కలిసిన దుర్గగుడి చైర్మన్



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దేవదాయ శాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్‌ను దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. గొల్లపూడిలోని దేవదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో హరిజవహర్‌లాల్‌ను దుర్గగుడి పాలక మండలి సభ్యులు కలిశారు. తొలుత ఆయన్ను చైర్మన్ కర్నాటి రాంబాబు శాలువాతో సత్కరించి, అమ్మవారి ప్రసాదాలను అందజేశారు. అనంతరం పాలక మండలి తొలి సమావేశంలో చర్చించిన పలు అంశాలను చైర్మన్ రాంబాబు కమిషనర్‌కు వివరించారు. కమిషనర్‌ను కలిసిన వారిలో పాలక మండలి సభ్యులు బుద్దా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చిన్న తిరునాళ్లకు గ్రామస్తులు సహకరించాలి

సీఐ నాగమురళి

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): శ్రీతిరుపతమ్మ అమ్మవారి చిన్న తిరునాళ్లలో ప్రధాన ఘట్టమైన అమ్మవారి పుట్టినిల్లు అనిగండ్లపాడు గ్రామం నుంచి మార్చి 9 న పెనుగంచిప్రోలు వచ్చే పసుపు-కుంకుమ బండ్ల రాకకు గ్రామస్తులందరూ సహకరించాలని జగ్గయ్యపేట సీఐ నాగమురళి కోరారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం పసుపు-కుంకుమ బండ్ల కార్యక్రమానికి సంబంధించి ఆయన గ్రామస్తులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఏడాది మాదిరిగా ఈ కార్యక్రమానికి గ్రామస్తులందరూ పార్టీలకతీతంగా సహకరించాలన్నారు. ఆచార, సంప్రదాయాలను గౌరవిస్తూ ఉత్సవంలో ఎక్కడా పార్టీ జెండాలు, పాటలు, రెచ్చగొట్టే మాటలు ఉండకుండా చూడాలన్నారు. ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు మాట్లాడుతూ అమ్మవారి ఉత్సవాలకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారని వారికి అసౌకర్యం కలగకుండా అమ్మవారి ఖ్యాతిని మరింత ఇనుమడింపజేయాలన్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ అమ్మవారి బండి వెనుక గ్రామంలో ఒప్పందం ప్రకారం ఈ ఏడాది టీడీపీ బండ్లు, తరువాత వైఎస్సార్‌సీపీ బండ్లు వస్తాయన్నారు. తిరునాళ్లకు పెనుగంచిప్రోలుతో పాటు అనిగండ్లపాడు గ్రామానికి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారని, పారిశుద్ధ్య నిర్వహణకు ఆలయం వారు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.జ్యోతి బ్రహ్మం, ఆలయ ఈఈ వైకుంఠరావు, ఏఈఓ ఉమాపతి, ఎస్ఐ హరిప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు పిడికిటి కోటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు కొత్తపల్లి పెంటయ్య, మండల కో-ఆప్షన్ సభ్యుడు జాన్‌మియా, డీటీ భాస్కరరావు, ఆర్ఐ జనార్ధనరావు, ఎంపీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి, ఆలయ మాజీ చైర్మన్లు నెల్లూరి గోపాలరావు, అచ్యుతరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు గంగూరి ప్రసాద్, ఉన్నం శ్రీనివాసరావు, వూట్ల లక్ష్మయ్య, యానాల సైదేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ నాగమురళి, పక్కన ఆలయ చైర్మన్ చెన్నకేశవరావు, సర్పంచ్ జ్యోతి తదితరులు

జగ్గయ్యపేటలో 98 శాతం పింఛన్ల పంపిణీ



పెనుగంచిప్రోలు: కొణకంచిలో వృద్ధురాలికి పింఛను పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బంది



కంచికచర్ల: మంచంలో ఉంటున్న వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సంగీత

జగ్గయ్యపేట: మండలంలోని 17 గ్రామ పంచాయతీలలో అన్ని రకాల పింఛన్‌లు 98 శాతం పంపిణీ చేసినట్లు ఎంపీడీవో జయచంద్ర గురువారం తెలిపారు. అన్ని గ్రామ సచివాలయాలలో వలంటీర్‌లు ఇంటింటికీ వెళ్లి పింఛన్‌లు అందజేశారు.

92 శాతం పింఛన్‌ల పంపిణీ

పెనుగంచిప్రోలు: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక పింఛన్ల పంపిణీ ఈనెల రెండవ రోజు గురువారం 92 శాతం పూర్తయినట్లు ఎంపీడీఓ ఎస్‌వీ ప్రసాద్ అన్నారు. వలంటీర్లు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ప్రజాప్రతినిధులతో కలిసి లబ్ధిదారుల గృహాలకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు.

అనారోగ్యంతో ఉన్న వృద్ధురాలికి పింఛన్ అందజేత

కంచికచర్ల: కంచికచర్ల అంబేద్కర్ నగర్‌కు చెందిన కారం తేరేజమ్మ రెండు నెలల క్రితం నందిగామ మండలం చెరువుకొమ్ముపాలెంలో ఉంటున్న తన కుమార్తెను చూసి రావడానికి వెళ్లి అక్కడ అనారోగ్యం పాలైంది. విషయం తెలుసుకున్న వలంటీర్ సంగీత కుమారి గురువారం కంచికచర్ల నుంచి చెరువుకొమ్ముపాలెం గ్రామానికి వెళ్లి తేరేజమ్మకు పింఛన్ నగదు అందజేసింది. దీంతో ఆ వృద్ధురాలు ఆనందం వ్యక్తం చేస్తూ సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేసింది.



వీరులపాడు: నిమ్రా హాస్పిటల్‌లో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ప్రశాంతి

వీరులపాడులో 85 శాతం పింఛన్ల పంపిణీ

వీరులపాడు: మండలంలో 85 శాతం మేర పింఛన్‌ల పంపిణీ జరిగిందని ఎంపీడీవో అరుంధతీ దేవి తెలిపారు. పొన్నవరం గ్రామానికి చెందిన తుపాకుల బాలనాగమ్మ అనారోగ్యంతో బాధపడుతూ గడిచిన వారం రోజులుగా నిమ్రా హాస్పిటల్‌లో చికిత్స పొందుతోంది. వలంటీర్ మందా ప్రశాంతి ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేసింది.

'యానిమేల్స్' చిత్ర పోస్టర్ ఆవిష్కరణ



భవానీపురం(విజయవాడపశ్చిమ): యానిమేల్స్ ది వైల్డ్ షాడోస్ సినిమా పోస్టర్‌ను సీనియర్ నటుడు సుమన్ ఆవిష్కరించారు. విరూరల్ మండలం గొల్లపూడి పరిధి వైఎస్సార్ కాలనీలోని చిత్ర యూనిట్ కార్యాలయంలో గురువారం పోస్టర్‌ను విడుదల చేశారు. బెజవాడలోని లొకేషన్స్‌లో చిత్రీకరించిన ఈ చిత్రానికి సంబంధించిన పలు అంశాల గురించి యూనిట్ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నటుడు సుమన్ మాట్లాడుతూ చిన్న సినిమాల కథ, కథనాలు బాగుంటే ప్రేక్షకులు ఆదరిస్తారన్నారు. చిత్ర నిర్మాత షెహనాజ్, దర్శకుడు లియో భార్గవ్‌లు మాట్లాడుతూ యానిమేల్స్ ది వైల్డ్ షాడోస్ కథ ఆకట్టుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో చిత్ర కథానాయకుడు శ్రీకాంత్, నటులు కుమార్ చంద్ రాయుడు, షఫీ, అర్బాజ్, కుమార్, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక నిధులు

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

గండేపల్లి(కంచికచర్ల): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి నిధులు మంజూరు చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. మండలంలోని గండేపల్లి నుంచి వీరులపాడు మండలం జమ్మవరం వరకు ఆర్అండ్‌బీ రోడ్డు మరమ్మతు పనులను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రోడ్ల అభివృద్ధి చేపట్టకపోవటంతోనే నియోజకవర్గంలోని అన్ని రోడ్లు మరమ్మతులకు గురయ్యాయని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రోడ్లను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. 4.2 కిలోమీటర్ల మేర ఆర్ అండ్‌బీ రోడ్డుపై పెద్ద పెద్ద గోతులు పడ్డాయని, ఆ రోడ్డు అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.40 లక్షల నిధులు మంజూరు చేసిందన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నాణ్యతా ప్రమాణాలతో కూడిన పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, సర్పంచి బొక్కా రవికుమార్, సొసైటీ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరెడ్డి, ఆర్ అండ్‌బీ డీఈఈ వై.శశిభూషణ్, ఏఈ సురేష్, పంచాయతీ కార్యదర్శి జిల్లేపల్లి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

కంచికచర్ల ఆరవ వార్డులో మండల పరిషత్ నిధులు రూ.18 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం, కల్వర్టుల నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే జగన్‌మోహనరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కంచికచర్ల పట్టణాభివృద్ధి కోసం ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేశామని ఆ ప్రణాళిక ప్రకారం అన్ని వార్డులను అభివృద్ధి చేస్తామన్నారు. వసంతకాలనీ, ఇందిరాకాలనీ, మోడల్‌కాలనీల ఇళ్లపై హెచ్‌టీ విద్యుత్ తీగల ద్వారా విద్యుత్ నిరంతరాయంగా సరఫరా అవుతుందని ఆ విద్యుత్ వైర్లు తొలగించాలని ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చారని అన్నారు. ఈ విషయం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తెలియజేశామని, తక్షణమే రూ.80 లక్షల నిధులు మంజూరు చేశారని ఆ నిధులతో త్వరలో విద్యుత్ వైర్లు తొలగింపు పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, సర్పంచి వేల్పుల సునీత, ఎంపీటీసీ సభ్యులు నన్నపనేని నరసింహారావు, మాడుగుల మధుబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ మాడుగుల శంకర్, ఎంపీడీఓ కె.బాలశంకరరావు, పీఆర్ ఏఈ టీవీ రవికుమార్ పాల్గొన్నారు.

రెరా దరఖాస్తుల ఆమోదంలో జాప్యం లేదు

లబ్బీపేట(విజయవాడతూర్పు): రెరా దరఖాస్తులు జాప్యం లేకుండా ఎప్పటికప్పుడు ఆమోదం పొందుతున్నాయని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వైస్ చైర్మన్ అత్తలూరి నాగమల్లేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీ రేరా అథారిటీ నుంచి అపార్ట్‌మెంట్ ప్రాజెక్ట్, రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్స్ రిజిస్ట్రేషన్ విషయంలో నిర్మాణదారులకు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. గతంలో సాంకేతిక సమస్యలతో కొన్ని ఆటంకాలు ఏర్పడినా, పదిహేను రోజుల్లో అన్ని దరఖాస్తులు పరిశీలించి ఆమోదించారని, ప్రస్తుతం ఎప్పటికప్పుడు అప్రూవల్ ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

విశ్వనాథం విగ్రహ ఏర్పాటుకు అభ్యంతరం శోచనీయం

కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణ అభివృద్ధితో ఎటువంటి సంబంధం లేని వ్యక్తుల విగ్రహాల ఏర్పాటుకు అభ్యంతరం చెప్పని తెలుగుదేశం పార్టీ నేతలకు, ఇక్కడే పుట్టి, ఇక్కడే పెరిగి విజయవాడ కంటే ముందుగా పంచాయతీగా ఉన్న జగ్గయ్యపేటకు 24 ఏళ్లు సర్పంచ్‌గా సేవలందించిన సర్దార్ సామినేని విశ్వనాథం విగ్రహం ఏర్పాటుకు అభ్యంతరం చెప్పడం శోచనీయమని కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం మున్సిపల్ వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, హఫీజున్నీసా, పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్, కౌన్సిలర్లతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పేట గ్రామానికి 50 ఏళ్ల క్రితమే రక్షిత మంచినీటి పథకం ద్వారా పైపులైన్ల వ్యవస్థ, విద్యుత్ సౌకర్యం వంటి అనేక సంస్కరణలు చేపట్టిన అభివృద్ధి ప్రదాత, ఎస్‌జీఎస్ కళాశాల వ్యవస్థాపక అధ్యక్షుడు, ఏఎంసీ చైర్మన్, సొసైటీ చైర్మన్‌గా ఎన్నో సేవలందించిన సామినేని విశ్వనాథం విగ్రహం ఏర్పాటును రాజకీయం చేయడం వారి దిగజారుడుతనానికి నిదర్శనం అన్నారు.